

# చిత్ర కదంబం

## సినీ బఠాణీలు

ఏరుకొొచ్చినవారు - సినీజ్ఞా నానందమహర్షి



### ఘంటసాల గారి గీత ప్రస్థానంలో కొన్ని సంగతులు

ఘంటసాల - భానుమతి పాడిన చివరి యుగళగీతం 'తాతమ్మ కల' సినిమాలో 'కోరమీసం సిన్నోడా..'
ఘంటసాల - నాగయ్య కలిసిపాడిన పాట 'పూలరంగడు' సినిమాలో 'చిల్లర రాళ్ళకు మొక్కుతు ఉంటె చెడిపోదువురా ఒరే..ఒరే..'
ఘంటసాల పాడిన ఒకే పాటలో అక్కినేని, నందమూరి కల్సి నటించినది 'గుండమ్మ కథ' లో 'కోలు కోలోయన్న కోలో నా సామి..' అనే పాటలో. 'శ్రీకృష్ణార్జున యుద్ధం'లో ఘంటసాల పాడిన పద్యాలకి కూడా ఇద్దరు హీరోలు కలిసి నటించారు.

### కస్తూరి శివరావు చెప్పిన జోక్




KASTHURI SIVA RAO

అలనాటి ప్రసిద్ధ కమెడియన్ కస్తూరి శివరావు మొదట్లో సినిమా ఆపరేటర్. ఆయన కొన్ని జోక్స్ చెబుతూ ఉండేవారు. తాను పనిచేస్తున్న పెండాలు (అప్పట్లో సినిమా థియేటర్‌ని అలా అనే వారు) ప్రొప్రయిటరు ఓ రోజు తనని చెడమడా తిట్టి ఉద్యోగం పీకేశారట. దానికి కారణం ఒక మూకీ అమెరికన్ సినిమా.

"అందులో ఒక అమ్మాయి దుస్తులు మార్చుకుంటూ ఉంటుంది. మనకి మొత్తం బాక్ షాట్ లోనే కనిపిస్తుంది. ఆ దృశ్యం రాగానే మా ప్రొప్రయిటరు తెరవెనక్కి వెళ్ళి నించునేవాడు. అక్కడా అలానే కనిపిస్తుందని ఆయనకి తెలీదు! దాంతో ఉగ్రుడై "నేను ఎన్ని సార్లు వెనక్కి వెళ్ళినా, నువ్వు బొమ్మ మార్చేస్తున్నావు. నాకు వీపు మాత్రమే కనిపిస్తోంది. నీ పొగరు భరించలేను- డిస్మిస్" అని నేనెంత చెబుతున్నా వినిపించుకోకుండా ఉద్యోగం ఊడగొట్టాడు.." అని చెప్పారు శివరావు.

(హ్యూమరథం లో రావి కొండలరావు)

### జిక్కీ- రాజా ల 'ప్రేమ లేఖలు'



"ఆహ్" హిందీ చిత్రాన్ని నిర్మించిన రాజ్ కపూర్ దాన్ని 'ప్రేమలేఖలు'గా తెలుగులోకి అనువాదం చేసిన విషయం చాలా మందికి తెలుసు. హిందీలో లతా, ముఖేష్‌లు హిందీలో పాడిన పాటల్ని తెలుగులో పాడేందుకు జిక్కి, రాజా లని ఎంపిక చేసారు. ఆరుద్ర గారు రాసిన 'పందిట్లో



పెళ్ళవుతున్నాది', 'విధి రాకాసి కత్తులు దూసి', ' పాడు జీవితమూ..' మొదలైన పాటలన్నీ జిక్కి, ఎ.ఎమ్ రాజా పాడినవే. ఈ పాటలు పాడే సమయానికి వారికి వివాహం కాలేదు. ఈ పాటల రికార్డింగ్ సమయంలోనే వారిద్దరి మనసులు కలిసి అతి త్వరలోనే పెళ్ళికి దారి తీసింది. ఈ విధంగా 'ప్రేమలేఖలు' చిత్రం ద్వారా ఈ ప్రముఖ గాయనీ గాయకులకి పెళ్ళి కుదిరింది. వివాహం తరువాత కొన్నేళ్ళు ఇద్దరూ మంచి డిమాండ్ లో ఉన్న "గాన దంపతులు" గా విలసిల్లారు. వారి కాంబినేషన్ పెద్ద సెన్సేషన్...

## గాయకుడు రచయితగా కీరవాణి



ప్రముఖ దర్శకుడు కీరవాణి అడపదడపా సినిమాల్లో పాటలు కూడా వ్రాస్తున్న విషయం గమనించే ఉంటారు. ఆయన వ్రాసిన మొదటి పాట 'ఆత్మబంధం' సినిమాలో 'పోరింక పడలేను..' అనేది. అలానే ఆయన యన సినిమాల్లో పాడిన మొదటి పాట 'మొండి మొగుడు - పెంకి పెళ్ళాం' సినిమాలో వేటూరి రాసిన 'నాటకాల జగతిలో జాతకాల జావళి..'
వేటూరి గారికి నేషనల్ ఎవార్డు తెచ్చి పెట్టిన 'రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే..' అనే పాటని కూడా కీరవాణి గారే పాడారు.

## తనని తనే ఏడిపించుకున్న ఆత్రేయ



ప్రముఖ రచయిత ఆచార్య త్రేయ 'పాటలు రాయక నిర్మాతలనీ, రాసి ప్రేక్షకుల్నీ ఏడిపిస్తా' రని అందరికీ తెలిసిన నగ్న సత్యం. అయితే ఇలా సమయానికి వ్రాయకపోవడం అనేది బయటి వారికే కాదు, తనకి తను కూడా అలానే చేసుకునే వారు. ఆయన దర్శక, నిర్మాతగా 'వాగ్దానం' అనే చిత్రం నిర్మించారు. శరత్ బాబు రాసిన అద్భుతమైన నవల 'వాగ్దత్త' ధారంగా తీసిన సినిమా అది. అప్పటికే రచయితగా గొప్ప పేరు తెచ్చుకున్న ఆత్రేయ గారు దర్శకుడవుతున్నాడంటే ఒక అద్భుతమైన దృశ్యకావ్యం వస్తుందని అందరూ ఊహించారు. అయితే దర్శకుడిగా ఉన్నప్పటికీ ఆయన కథమీద, మాటల మీద, చిత్రీకరణ మీదా మనసుపెట్టలేదు. ఒక విధంగా చెప్పాలంటే అందర్నీ ఏడిపించినట్లే - ఆయన్ని యనే ఏడిపించుకునేవారు. తీయవలసిన సీను రాయక, షూటింగ్ కి సమయానికి రాక ఆయన కోసం మేము నిరీక్షిస్తూ కూర్చోవడం, ఆయన వచ్చేలోపల షాట్ కూడా ఏర్పాటు ఏర్పాటు చెయ్యడం అలా జరిగింది. విధంగా ఆయనతో ఆయన సహకరించుకోకుండా, తనకి తనే కీడు కల్పించుకున్నారు. చేస్తున్న వృత్తిమీద పూర్తి బాధ్యతని పెట్టుకుని వ్యవహరించి ఉంటే, అంతటి ఊహలు, ఆలోచనలు గల రచయిత - డైరెక్టర్‌గా కూడ ఎంతటి గొప్ప స్థానంలో వుండేవారో కదా అనిపిస్తుంది. అలా జరగలేదే అని తలచుకున్నప్పుడు ఎంతో బాధ.

('నేను - నా దర్శకులు' లో అక్కినేని)

## అంతగా ప్రజాదరణ పొందని సినిమాల్లో ఆత్రేయ రాసిన పాటల్లోని మంచి వాక్యాలు



ఉన్న నాడు వున్నదాని విలువ తెలియదు
తెలుసుకున్న నాడు అది చేతి కందదు
పగిలిన గుండె రగులుతు ఉంటే
బ్రతుకొక బండగా బరువై పోతే
నిప్పును ఆర్పవురా నీ కన్నీళ్ళు
న్యాయం చెప్పరురా! ఏ దేవుళ్ళు
**ఏడడుగుల బంధం** (1985)

కలగా కరిగిపోయే చంద్రుడు
వెలుగై రగిలిపోయే సూర్యుడు
ఇద్దరైనా ఒక్కరైనా వెలుగు ఒక్కటే ఉన్నది
వలపు శాశ్వతమైనది
**మరో మొనగాడు** (1985)



వెన్నెల్లు వచ్చినా చీకట్లు ముసిరినా
ఒక రాత్రినే మురియు ఆకాశమై
ఒక బాటనైనా ఎడబాటునైనా
ఒక ప్రీతినే చూపు అనుబంధమై
**శిక్ష** (1985)

పుట్టే నాడు గిట్టని నాడు
మనసు మమత మనిషికి తెలియని భావాలు
మసి పూసిన సత్యాలు - మధురమైన శిధిలాలు
ఈ శిధిలాలకు చరిత్ర ఉంటుందా
ఈ జన్మలకు జన్మే లేదని రాసే ఉందా - అందుకే
దేవుడే నాస్తికుడై - మారితీరని
మానవుడిని దానవుడుగ మార్చి చూడని
**శ్రీవారు** (1985)



మనసు పడితే ప్రేమౌతుంది
ప్రేమ చెడితే ఏమవుతుంది
చెప్పరాని ఒప్పుకోని తప్పవుతుంది
అది ఆర్పలేని నిప్పు అవుతుంది
(కెప్టెన్ నాగార్జున 1986)

****

## సినిమాల్లో తొలిరేయి నాడు నేడు

కాలగతిన సినిమా పాటల సాహిత్యంలో వచ్చిన కొన్ని మార్పులు
తొలిరేయి సన్నివేశాల్లో అలనాటి పాటలు - ఈ నాటి పాటలు మచ్చుకి కొన్ని

హాయి సఖీ..హాయి సఖీ
హాయి సఖీ..హాయి సఖీ
బ్రతుకే హాయి సఖీ..ఈ బ్రతుకే హాయి సఖీ..
హాయి గొల్పు ఈ రేయి
మధుర స్వప్నమోయి
వెన్నెల ప్రోవుల - క్రొన్నన తావుల
వలపుల వలతో - నీ చేదోయి
తళుక్ తళుక్కని మెరుపు తీగలై
విరిసె నీదు కనుదోయి
జల జల జల ప్రణయ మధువులే
కురిసె నాదు మదినోయి

స్వర్గ సీమ (1945)

ఎంత హాయి ఈ రేయి
ఎంత మధురమీ హాయి
చందమామ చల్లగా
మత్తుమందు చల్లగా
ఒకరి చూపులొకరిపైన విరితూపులు విసరగా..
...

కానరాని కోయిలలు - మనల మేలుకొలుపగా
కానరాని కోయిలలు - మనకు జోలపాడగా
మధుర భావ లాహిరిలో మనసు తూలిపోవగా
మధుర భావ లాహిరిలో మనము తూలిపోవగా

గుండమ్మ కథ (1962)

ఏవేవో చిలిపి తలపులురుకుతున్నవి
అవి ఎలా ఎలా చెప్పాలో తెలియకున్నవి
....
మరపురాని తొలిరేయి మరలరానిది
మనుగడ ఈ నాటితో మనది కానున్నది

సుమంగళి (1965)

ఇంకాస్త ముందుకి
భామా భామా పడుచురేయి అదరనీ
మామా మామా సిలుకు చీర నలగనీ
మరి పాలో పళ్ళో అందించి
ముందేదో నువ్వే వివరించు

ఏవండీ! ఆవిడొచ్చింది (1992)

చెదరని పాపిడి వయసుకే శాపము
అలిగిన చీరకు నలిగితె మోక్షము
స్వర్గమంటే పైన కాదు
కిందనే ఉంది చూసుకో....
నెమ్మది నెమ్మది ఎక్కడో హాయి ఉన్నది
ఓపలేని తీపి బాధ ఎక్కువైతె కళ్ళు మూసుకో..

ఘరానా మొగుడు (1992)

****